## కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

తాండూర్, మే 6 : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 26 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అధికారులు, నాయకులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, అధికారులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కన్నెపల్లిలో ఎమ్మెల్యే పర్యటన

కన్నెపల్లి, మే 6 : కన్నెపల్లి మండలంలో మంగళవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి పర్యటించారు. సుర్జాపూర్, ఎల్లారం గ్రామాల్లో నూతనంగా వేసిన బీటీ రహదారులను ప్రారంభించారు. పలువురు లబ్దిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం జన్కాపూర్ గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగ రావు, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

## ప్రవేశాలకు లక్కీడ్రా

నస్పూర్, మే 6 : మంచిర్యాల జిల్లాలోని మూడు మైనార్టీ స్కూళ్లలో 5 వ తరగతిలో ప్రవేశానికి మంగళవారం జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజేశ్వరి, రీజనల్ డైరెక్టర్ పుష్పలత లక్కీడ్రా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

సీసీసీ నస్పూర్, మే 6: సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. మంగళవారం సీసీసీ నస్పూర్ ఎస్ఐ ఉపేందర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి ఆరుగురుని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.26,770 నగదు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉపేందర్‌రావు తెలిపారు.

## ఆర్థిక సహాయం

దండేపల్లి, మే 6: దండేపల్లి మండల కేంద్రానికి చెందిన కే సోమశేఖర్ ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. దీంతో సోమశేఖర్‌ను 1988-89 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు ఆపన్న హస్తం అందించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.31వేల ఆర్థిక సహాయం అందించి ఔదార్యం చాటుకున్నారు.

## నాణ్యమైన ఆహారమందించాలి

మంచిర్యాల అర్బన్, మే 6 : జిల్లా ప్రభుత్వ దవాఖానలో రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్ సూచించారు. మంచిర్యాల జిల్లా ప్రభుత్వ దవాఖానను జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో హాస్పిటల్‌ను సందర్శించి రోగులకు అందిస్తున్న ఆహారాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. రోగులకు రుచికరమైన, నాణ్యమైన ఆహారం అందించాలని నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవన్నారు. ఇక్కడ వైద్యాధికారి భీష్మ, ఆర్ఎంవో ప్రసాద్, బాలాజీ, ప్రసాద్ తదితరులు ఉన్నారు.


### బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజాణికానికి, బ్యాంకులు మరియు ఫైనాన్షియల్ సంస్థలకి తెలియపరుచునది ఏమనగా! శ్రీ నఖీంబాబా S/o. తాజ్‌బాబ, నివాసం ఇంటి నెం. 1-16-67/1, కాగజ్‌నగర్ నివాసి. ఈ క్రింది షెడ్యూలు ఆస్థికి యజమానిగా ఉండి రూం నిమిత్తం ఇండస్‌ఇండ్ బ్యాంక్, మంచిర్యాల శాఖను సంప్రదించియున్నారు. ఇట్టి ఆస్తి నఖీంబాబా గారు దానాపట్టా దస్తావేజు నంబర్ 284/2024, తేది. 26-02-2024 ద్వారా తాజ్‌బాబా నుండి సంక్రమించబడినది, ఇట్టి ఆస్థికి మున్సిపాలిటి కాగజ్‌నగర్‌లో నఖీంబాబా యజమానిగా ఉన్నారు.

**షెడ్యూల్ ఆస్థి వివరాలు**

ఇంటి నెంబర్ 1-16-67/1 (అసెస్‌మెంట్ నెం. 1097004130), ఎసి షీట్స్ గ్రౌండ్ ఫ్లోర్ కట్టడపు విస్తీర్ణం 468 చదరపు ఫీట్లు, ఇంటి స్థల విస్తీర్ణం 252.49 చదరపు గజాలు లేక 211.10 చదరపు మీటర్లు, గ్రామము కొత్తపేట (కాగజ్‌నగర్) (సీతాపతి ఏరియా), కాగజ్‌నగర్ మున్సిపాలిటీ, మండలం కాగజ్‌నగర్, జిల్లా కొమురంభీమ్ ఆసిఫాబాద్. **హద్దులు- తూర్పు- రోడ్, పడమర-రోడ్, ఉత్తరం-చాంద్‌పాషా గారి ఇల్లు, దక్షిణం-నఖీం బాబా గారి ఇల్లు.**

కావున పై షెడ్యూల్ ఆస్తి తాకట్టుపై ఏ వ్యక్తికైనా, ఏ సంస్థకైనా అభ్యంతరాలు, అక్షేపణలు ఉన్నయెడల అట్టి అభ్యంతరాలను సరైన సాక్షాధారాలతో ఈ దిగువ అడ్రస్ నందు 7 రోజుల గడువులోగా తెలియపరచగలరు. లేనియెడల పై ఆస్థిపై ఇండస్ ఇండ్ బ్యాంక్, మంచిర్యాల శాఖ రుణం విషయంలో తదుపరి ప్రక్రియతో ముందుకు కొనసాగుదురు.

తేది. 06-05-2025 మంచిర్యాల

**Sd/- V. SATYA NARAYANA,** B.Sc., L.L.M
Advocate, Mancherial. **Cell: 98496 52083.**


## కాసిపేట గనిపై ఏఐటీయూసీ గేట్ మీటింగ్

కాసిపేట, మే 6 : మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి వెంకటస్వామి, బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి పాల్గొని మాట్లాడారు. ఈ నెల 20న కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఒక్కరోజు సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపు నిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, పిట్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, రాజేందర్, పార్వతి సురేశ్, లింగయ్య, సంపత్, అనిల్, రంజిత్ కుమార్, అశోక్, గణేశ్, శంకరయ్య, శ్రీనివాస్, ఆడెపు రవీందర్, రఘురాం, మహేశ్, పాషా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య

హాజీపూర్, మే 6 : మండల కేంద్రంలో ఓ వివాహిత మంగళవారం అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుంది. హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ రాజ్ తెలిపిన వివరాల ప్రకారం, హాజీపూర్ గ్రామానికి చెందిన వివాహిత గురిజాల మనీష (25) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతుందన్నారు. ఈక్రమంలో జీవితంపై విరక్తితో మనస్తాపం చెంది ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందన్నారు. మనీషకు మూడేళ్ల వయసున్న కుమారుడున్నాడు. మనీష తండ్రి బొలిశెట్టి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ప్రతి కేసునూ క్షుణ్ణంగా పరిశీలించాలి

మంచిర్యాల అర్బన్, మే 6: ప్రతి కేసునూ క్షుణ్ణంగా పరిశీలించాలని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, ఆత్మహత్యలు, మిస్సింగ్ కేసులపై పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి తగిన కారణాలు పరిశీలించి, సంబధిత శాఖల అధికారులతో కలిసి నివారణ చర్యలు చేపట్టేందుకు అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. దొంగతనాల నివారణకు అదనంగా సిబ్బందితో పెట్రోలింగ్, తనిఖీలు నిర్వహించేందుకు, ఆత్మహత్యల నివారణకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆదేశాలిచ్చినట్లు వెల్లడించారు. మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

మందమర్రి, మే 6: వేసవి శిక్షణ తరగతులను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జీ దేవేందర్ అన్నారు. సింగరేణి మందమర్రి ఏరియా డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో పట్టణంలోని సింగరేణి పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ వేసవి శిక్షణ తరగతులను మంగళవారం జీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం దేవేందర్ మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వం, మానకోల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం విజయప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, సీఎంవోఏఐ అధ్యక్షుడు రమేశ్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, క్రీడల గౌరవ కార్యదర్శి ఎం కార్తీక్, క్రీడల సంయుక్త కార్యదర్శి శివకృష్ణ, జనరల్ కేప్టెన్ శ్రీనివాస్, గ్రౌండ్ ఇన్‌చార్జి నస్పూరి తిరుపతి, పీఈటీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

## కార్మికుడి మృతికి బాధ్యత వహించాలి

బెల్లంపల్లి, మే 6: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి 1 ఇంక్లైన్‌లో విధులు నిర్వర్తిస్తూ తేనెటీగల దాడిలో మృతి చెందిన ఉప్పుల నర్సయ్య మృతికి సింగరేణి కాంట్రాక్టర్లే పూర్తి బాధ్యత వహించాలని టీఎస్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి టీ మణిరామ్‌సింగ్, సింగరేణి గని కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు అంబాల మహేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం బెల్లంపల్లి సింగరేణి ఏరియా దవాఖాన వద్ద నర్సయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఐదు లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని పేర్కొన్నారు. సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందని ఆరోపించారు. సింగరేణి సంస్థ నుంచి వచ్చే అన్ని బెనిఫిట్స్‌ను అందజేయాలని డిమాండ్ చేశారు.

## చెక్ బౌన్స్ కేసులో ఒకిరికి జైలు

మంచిర్యాల అర్బన్, మే 6: చెక్ బౌన్స్ కేసులో ఒకరికి అరు నెలలు జైలు శిక్షతో పాటు తీసుకున్న అప్పు తిరిగి చెల్లించాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కే నిరోష మంగళవారం తీర్పునిచ్చారు. వివరాల ప్రకారం, మందమర్రి మండలం రామకృష్ణాపూర్‌కు చెందిన కే సూర్యప్రకాశ్ రావుకు రెబ్బెన మండలం గోలేటి క్రాస్ రోడ్డులో గల వెంకటేశ సిరమిక్స్ కంపెనీ మేనేజింగ్ పార్ట్నర్ ప్రసన్నలక్ష్మిదేవి మధ్య వ్యాపార లావేదేవీలు ఉన్నాయి. ఈ క్రమంలో సూర్యప్రకాశ్‌కు రూ.12లక్షల చెక్కును వెంకటేశ సిరమిక్స్ కంపెనీ పేరు మీద లక్ష్మి ప్రసన్న అందజేశారు. అగ్రిమెంట్ ప్రకారం డబ్బులు చెల్లించక పోవడంతో సూర్యప్రకాశ్ 2013లో కోర్టును ఆశ్రయించాడు. న్యాయమూర్తి ఇరువురి వాదనలు విన్న తర్వాత సూర్యప్రకాశ్‌కు రూ.12 లక్షలు చెల్లించాలని, దీంతోపాటు ఆరు నెలల సాదారణ జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

చెన్నూర్ రూరల్, మే 6: కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పలు ధాన్యం కొనుగోలు సెంటర్లను ఆయన పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సెంటర్ నిర్వాహకులకు సూచించారు. మండలంలో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని ఎంపీడీవోకు సూచించారు. ఆయన వెంట ఎంపీవో అజ్మత్ అలీ, పంచాయతీ సెక్రటరీలున్నారు.

# యాజమాన్యాలకు సమ్మె నోటీసులు



శ్రీరాంపూర్ : సింగరేణి యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు



శ్రీరాంపూర్ : జీఎంకు సమ్మె నోటీసు ఇస్తున్న సీఐటీయూ నాయకులు



కౌటాల : కౌటాల ఎంపీడీవోకు వినతి పత్రం అందచేస్తున్న పంచాయతీకార్మికులు

శ్రీరాంపూర్, మే 6 : ఈ నెల 20న దేశ వ్యాప్తంగా చేపడుతున్న సమ్మెను సింగరేణిలో చేపట్టడానికి మంగళవారం ఏఐటీయూసీ నాయకులు జీఎం(పర్సనల్ పీఎం,ఐఆర్) కవితానాయుడుకు సమ్మె నోటీసు అందించారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య యాజమాన్యానికి సమ్మె నోటీ సు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ దేశంలో ఉన్న అన్ని కార్మిక సంఘాలు కలిసి మే 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని ఆయన పేర్కొన్నారు. సమ్మెలో భాగస్వాములమవుతూ సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలతో సమ్మె నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. సింగరేణి కార్మిక వర్గం మే 20న జరిగే ఒక్క రోజు టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సింగరేణిలో ప్రతిపాదిత బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని రద్దు చేసి సింగరేణికి కేటాయించాలని, గనులు ప్రైవేటీకరణ చేయరాదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శులు వైవీ రావు, మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, నాయకులు రమణమూర్తి, మల్లికార్జున్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

### జీఎంకు సమ్మె నోటీసు ఇచ్చిన సీఐటీయూ

శ్రీరాంపూర్, మే 6 : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను నిలుపుదల చేయాలని, సింగరేణి పరిరక్షణకు కొత్త గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ నాయకులు ఈ నెల 20న చేపట్టబోయే సమ్మెపై జీఎం శ్రీనివాస్‌కు నోటీసు ఇచ్చారు. సీఐటీయూ బ్రాంచి అధ్యక్షుడు గుల్ల బాలాజీ, చీఫ్ ఆర్గనైజర్ వెంగళ శ్రీనివాస్ జీఎంకు సమ్మె నోటీసు అందించి మాట్లాడారు. కార్మికులు ఈ నెల 20 టోకెన్ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచి నాయకులు పెరుక సదానందం, సాయిళ్ల శ్రీనివాస్, సిరికొండ శ్రీనివాస్, ప్రతాప్ పాల్గొన్నారు.

### పంచాయతీ కార్మికులు..

కౌటాల, మే 6 : పంచాయతీ కార్మికుల సమ్మెలో భాగంగా కౌటాల మండలంలోని పంచాయతీ కార్మికులంతా పాల్గొంటున్నట్లు మంగళవారం ఎంపీడీవో రమేశ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పంచాయతీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి దేశ వ్యాప్తంగా ఈ సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జాడి మోరేశ్వర్, జిల్లా కార్యదర్శి మోర్లె నాగేశ్, పంచాయతీ కార్మికులున్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



ఎస్టీపీపీ టూటీఎంసీ రిజర్వాయర్ సోలార్‌ప్లాంటు వద్ద అధికారులతో ఎన్విరాన్మెంట్ సలహాదారు

జైపూర్, మే 6: పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని సింగరేణి అటవీ, ఎన్విరాన్మెంటల్ సలహాదారు మోహన్ చంద్ర పర్గెయిన్ (రిటైర్డు ఐఎఫ్ఎస్ అధికారి) అన్నారు. మంగళవారం ఎస్టీపీపీలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా టూటీఎంసీ రిజర్వాయర్, ఫ్లోటింగ్ సోలార్, ప్రతిపాదిత 800 మెగావాట్ ప్రదేశంతో పాటు రక్షత అటవీ ప్రాంతాలు పరిశీలించారు. పర్యావరణ రక్షణతో భావితరాలకు మంచి భవష్యత్తును ఇచ్చిన వారమవుతామని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జీఎం శ్రీనివాసులు, డీజీఎం సోలార్ ఎస్ శ్రీనివాస్, డీజీఎం సివిల్ అజజుల్లా ఖాన్, డీజీఎం ఎన్విరాన్‌మెంట్ వాసుదేవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

- అదనపు కలెక్టర్ డేవిడ్

దహెగాం, మే 6: వరి ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ డేవిడ్ ఆదేశించారు. మంగళవారం దహెగాం, లగ్గాం గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. తేమ శాతం 17కు రాగానే తూర్పార పట్టించి కాంటా పెంచాలని సూచించారు. ప్రస్తుతం అక్కడక్కడా అకాల వర్షాలు కురుస్తున్నాయని, అందుకే కొనుగోళ్లలో వేగం పెంచి మిల్లులకు తరలించాలని సూచించారు. ధాన్యం వర్షానికి తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలే రాజ్‌కుమార్, శ్రీనివాస్, కళ్లాల ఇన్‌చార్జిలు ఉన్నారు.

## ఉద్యోగులకు ఇన్సెంటివ్ చెల్లించాలి



డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్లుకు వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా

శ్రీరాంపూర్, మే 6 : శ్రీరాంపూర్ ఓసీపీ సీహెచ్‌పీల కోడ్‌లను విభజించి ఉద్యోగులకు ఇన్సెంటివ్ చెల్లించాలని కోరుతూ మంగళవారం శ్రీరాంపూర్‌కు వచ్చిన డైరెక్టర్(పీపీ, పా) వెంకటేశ్వర్లును ఏఐటీయూసీ నాయకులు కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా మాట్లాడుతూ, శ్రీరాంపూర్ ఓసీపీ సీహెచ్‌పీల కోడ్‌లు ఓసీ-2 3411, సీహెచ్‌పీ-3492 వేరు వేరుగా అమలు చేసి ప్రోత్సాహకాలు (ఇన్సెంటివ్‌లు) అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా చర్చల కమిటీ సభ్యులు బద్రి బుచ్చయ్య, గొల్లపల్లి రామచందర్, మైనింగ్ స్టాఫ్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఏరియా కార్యదర్శి మూడ సుధాకర్, ఓసీపీ ఫిట్ కార్యదర్శి మోతె లచ్చన్న, బొడ్డు సందీ, రమేశ్ పాల్గొన్నారు.

## ఉత్పత్తి లక్ష్య సాధనకు సమష్టిగా కృషి చేయాలి

శ్రీరాంపూర్, మే 6 : బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు అధికారులు, ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలని డైరెక్టర్ (పీపీ) కే వెంకటేశ్వర్లు కోరారు. శ్రీరాంపూర్, ఇందారం ఉపరితల గనుల ఓబీ, బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనపై మంగళవారం సంస్థ డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్లు జీఎం ఆఫీస్‌లో జీఎం ఎం శ్రీనివాస్, ప్రాజెక్టు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ, శ్రీరాంపూర్ ఓసీపీ వార్షిక ఓవర్ బర్డెన్ లక్ష్యం 320 లక్షల క్యూబిక్ మీటర్లు, ఇందారం ఓసీపీకి 240 లక్షల క్యూబిక్ మీటర్లుగా నిర్ధేశించినట్లు తెలిపారు. ఈ లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, ప్రాజెక్టు అధికారులు టీ శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, సర్వే అధికారులు రామ్మోహన్, దావూద్, ఓబీ కాంట్రాక్టర్లు సీఆర్ఆర్, జీవీఆర్, వరాహ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బొగ్గు లారీ బోల్తా

వాంకిడి,మే 6 : మండల కేంద్రంలోని అటవీ శాఖ చెక్‌పోస్ట్ సమీపంలో 363 జాతీయ రహదారిపై బొగ్గు లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. స్థానికులు తెలిపిన ప్రకారం, ఆసిఫాబాద్ వైపు నుంచి మహారాష్ట్రకు బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తాపడగా, డ్రైవర్ గాయాలతో బయటపడ్డాడని స్థానికులు తెలిపారు. నేషనల్ హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన డ్రైవర్‌ను అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స కోసం ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు.

## రైలు ఢీకొని పశువులు మృతి

రెబ్బెన, మే 6: రైలు ఢీకొన్న ప్రమాదంలో నాలుగు పశువులు మృతి చెందినట్లు బెల్లంపల్లి రైల్వే ఏఎస్ఐ రాథోడ్ మోహన్ తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్ నుంచి రేచిన్ రైల్వేస్టేషన్ మధ్యలో పశువులు రైల్వే ట్రాక్ పైకి వచ్చి పట్టాలు దాటుతుండగా దురంతో ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనగా మృతి చెందినట్లు తెలిపారు. రైల్వేస్టేషన్లు, రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్న గ్రామాలకు చెందిన పశువుల యజమానులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## అక్రమాలకు పాల్పడిన సీసీ సస్పెన్షన్

ఆసిఫాబాద్ టౌన్, మే 6: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తు న్న సీసీ సురేందర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు డీఆర్డీఏ దత్తారాం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా డీఆర్డీ ఏ మాట్లాడుతూ, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ ఉపాధి కూలి డబ్బుల అక్రమాలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యం లో ప్రాథమిక విచారణ జరిపి సదరు సీసీని విధుల నుంచి స స్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి విచారణ కోసం విచారణ అధికారిని నియమించనున్నట్లు ఆయన తెలిపారు.

## అంబలి పంపిణీ ప్రారంభం

కెరమెరి, మే 6: మండలంలోని సేంద్రియ ఉత్పత్తిదారుల రై తు పరస్పతి సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కెరమెరిలో అంబలి పంపిణీ చేశారు. రైతులు కేంద్రే బాలాజీ, కుమ్రం నాణేశ్వర్, ఆడ రాంచందర్ మాట్లాడుతూ, ఎండల్లో ప్రజలు ఉపశమనం పొందేందుకు ఉచితంగా అంబలి పంపిణీ చేస్తున్నామన్నారు. అంబలి పంపిణీ నెలరోజులు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సిడాం జగన్నాథ్ రావ్, షేక్ రజక్ తదితరులున్నారు.

## తాగునీటి సమస్యలపై స్పందించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 6 : జిల్లాలో ఉత్పన్నమయ్యే తాగునీటి సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ ఇంజినీర్లు, జిల్లా పంచాయతీ, గ్రామీణాభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో జిల్లాలో తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తాగునీటి సమస్యలపై దినపత్రికలు, ప్రసార సాధనాల్లో వచ్చిన కథనాలపై అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పౌర సంబంధాల అధికారి సంపత్ కుమార్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, మిషన్ భగీరథ ఈఈ సిద్ధిఖీ అధికారులు పాల్గొన్నారు.

## ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

ఆసిఫాబాద్ టౌన్, మే 6: జిల్లాలో ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు, లబ్ధిదారుల జాబితాలపై హౌసింగ్ పీడీ, ఇంజినీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా పైలట్ గ్రామాల్లో ఎంపిక చేసిన లబ్ధిదారులు తమ ఇండ్ల పనులను ప్రారంభించేలా ఇంజినీర్లు చర్యలు తీసుకోవాలని, బేస్‌మెంట్ లెవెల్ వరకు పూర్తి చేసిన లబ్ధిదారుడి వివరాలు నమోదు చేసి మొదటి విడుత నిధులు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వేణుగోపాల్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి

కెరమెరి, మే 6: ఉపాధి హామీ పనుల ప్రదేశంలో కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని మండల ప్రత్యేకాధికారి వెంకట్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అజ్మద్‌పాషాతో కలిసి ఈజీఎస్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో కూలీలకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా తాగునీటితోపాటు షెడ్డు, మెడికల్ కిట్ వంటివి తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో మల్లయ్య, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఆర్సీ జిల్లా చైర్మన్‌కు సన్మానం

కెరమెరి, మే 6: జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్‌గా నియమితులైన రాథోడ్ రమేశ్‌ను రాష్ట్ర చైర్మన్ బద్దిపడగ శ్రీనివాస్ రెడ్డి శాలువాతో సన్మానించారు. మంగళవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన రమేశ్‌కు ఐడెంటిటీ కార్డు అందించి జిల్లాలో చేస్తున్న సేవలపై అభినందించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న పలు సమస్యలపై రాష్ట్ర చైర్మన్‌తో చర్చించి పరిష్కారానికి కృషి చేద్దామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ మర్రి మహిపాల్ సభ్యులున్నారు.

## రైల్వే ప్రైవేటీకరణ ఆపాలి

కాగజ్‌నగర్, మే 6: కేంద్ర ప్రభుత్వం రైల్వే ప్రైవేటీకరణ ఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు మంగళవారం కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైళ్లలో వసతులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, స్టేషన్లలో మౌలిక వసతులు కల్పించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, సంజీవ్, తదితరులున్నారు.

## గ్రంథాలయ అభివృద్ధికి కృషి

రెబ్బెన, మే 6: రెబ్బెన మండల కేంద్రంలోని గ్రంథాలయానికి నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరిస్తానని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ రియాజ్ అన్నారు. మండల కేంద్రం లోని గ్రంథాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. మండల కేంద్రంలో ఉన్న గ్రంథాలయం సరిపోవటం లేదని, పాత పోలీస్‌స్టేషన్‌లో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు లావుడ్య రమేశ్, మోడెం సుదర్శన్‌గౌడ్, మడ్డి శ్రీనివాసగౌడ్, దుర్గం రాజేశ్, దుర్గం అన్నాజీ, జహీర్‌బాబా, నాసీర్ ఉస్మానీ, మోడెం రాజేంద్రప్రసాద్‌గౌడ్, గ్రంథాలయ సిబ్బంది ఉన్నారు.

## కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

మందమర్రి, మే 6: పార్టీ అభివృద్ధి కోసం పని చేసిన కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందని బీఆర్ఎస్ చెన్నూర్ నియోజక వర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజారమేశ్ అన్నారు. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీపతి నగర్ 15వ వార్డు అధ్యక్షుడు విరుగురాల గిరి, 17వ వార్డుకు చెందిన సీనియర్ నాయకుడు మల్లంపల్లి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ఆదేశాల మేరకు మంగళవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధిత కుటుంబాల సభ్యులను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.15 వేలతోపాటు 50 కిలోల చొప్పున బియ్యం ఇతర నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు బండారు సూరిబాబు, మేడిపల్లి సంపత్, ఓ రాజశేఖర్, బడికెల సంపత్, కొంగల తిరుపతి రెడ్డి, ఈశ్వర్, బోరిగం వెంకటేశ్, భట్టు రాజ్‌కుమార్, కనకం రవీందర్, పల్లె నర్సింగ్, బత్తుల శ్రీనివాస్, కొండల్ రావు, కుడాల తిరుపతి, భూపెల్లి కనకయ్య, పూసాల ఓదెలు, రామసాని శేఖర్, ముల్కల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వ రంగ సంస్థ

**మంచిర్యాల మెయిన్ శాఖ**
**చిరునామా: వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా, మార్కెట్ రోడ్, మంచిర్యాల-504208. ఇ-మెయిల్: ubin0803634@unionbankofindia.bank**

### స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

**{సెక్యూరిటీ ఇంటరెస్ట్(ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(1)}**

దిగువ సంతకందారు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మంచిర్యాల మెయిన్ శాఖ** యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో తెలిపిన మొత్తం **రూ. 21,47,905.32 (ఇరవై ఒక్క లక్షల నలభై ఏడు వేల తొమ్మిది వందల ఐదు రూపాయల ముప్పై రెండు పైసలు మాత్రమే)** తిరిగి చెల్లించవలసిందిగా **రుణగ్రహీత: 1) శ్రీమతి ఆకుల తిరుమల, 2) కో-ఆబ్లిగెంట్: శ్రీ ఆకుల శ్రీనివాస్** వారిని కోరుతూ 03.02.2025 తేదీగల డిమాండ్ నోటీసు జారీచేశారు.

రుణగ్రహీత సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలం కావడంచేత సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువబడు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాల్ని వినియోగించి దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **05 మే 2025న** స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తితో ఏ విధమైన లావాదేవి జరుపరాదని మరియు సదరు ఆస్తితో జరుపు ఏవేని లావాదేవీలు 29.01.2025 నాటికి **రూ. 21,47,905.32 (ఇరవై ఒక్క లక్షల నలభై ఏడు వేల తొమ్మిది వందల ఐదు రూపాయల ముప్పై రెండు పైసలు మాత్రమే)** మరియు దానిపై వడ్డీ కలిపి సదరు మొత్తం కొరకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చార్జ్‌కి లోబడి వుంటాయని ప్రత్యేకించి రుణగ్రహీతను మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు అందుబాటులో గల సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్(8)లోని నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలకు తెలియజేయడమైనది.

**స్థిరాస్తి వివరణ**

శ్రీమతి ఆకుల తిరుమల భర్త శ్రీ శ్రీనివాస్‌కు చెంది ఉండి, 250 చ.గజాలు కలిగిన, మంచిర్యాల, పద్మశాలి కాలనీ, ఎస్ఆర్ డిజి స్కూల్ సమీపాన, బ్లాక్ నెం.18, సర్వే నెం.448/ఎ1, నివాస ఇం.నెం.18-217/10-4 వద్ద గల నివాస భూమి మరియు భవనం యావత్తు, సరిహద్దులు: తూర్పు: 20 అడుగుల రోడ్, పడమర: బదరున్నీసా ప్లాట్ నెం.34, ఉత్తరం: ప్లాట్ నెం.23, దక్షిణం: 25 అడుగుల రోడ్.

**యజమాని పేరు: శ్రీమతి ఆకుల తిరుమల,** డాక్యుమెంట్ నెం.: 1780/2008 తేది: 15.04.2008

**తేది: 05.05.2025**
**ప్రదేశం: మంచిర్యాల**

**సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**


## సోలార్ లైట్ల పంపిణీ



జైపూర్: కాన్కూర్‌లో సోలార్ ప్యానల్స్ అందిస్తున్న టీజీఎఫ్‌డీసీ అధికారులు

జైపూర్/కోటపల్లి/రెబ్బెన, మే 6: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కాన్కూర్ గ్రామం, కోటపల్లి మండలంలోని షట్‌పల్లి గ్రామంలో, రెబ్బెన మండలం తుంగెడ గ్రామంలో సోలార్‌లైట్లు పంపిణీ చేశారు. అటవీ అభివృద్ధి సంస్థ దశాబ్ది ఉత్సవాల్లో కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా లైట్లు పంపిణీ చేసినట్లు డివిజనల్ మేనేజర్ శ్రావణి తెలిపారు. కార్యక్రమాల్లో ఎఫ్ఆర్వో లక్ష్మణ్, టీజీఎఫ్‌డీసీ మంచిర్యాల ప్లాంట్ మేనేజర్ గోగు సురేశ్‌కుమార్, కార్యదర్శి రాజు, సూపర్‌వైజర్లు రాజేశ్, శ్రీనివాస్, వాచర్‌లు శంకర్, సాయికిరణ్, లచ్చన్న, ఓదెలు, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగల పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న కౌటాల సీఐ ముత్యం రమేశ్

కౌటాల, మే 6 : తెలంగాణ, మహారాష్ట్రలో పలు దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగలను మంగళవారం పట్టుకున్నట్లు కౌటాల సీఐ ముత్యం రమేశ్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం, చింతలమానేపల్లి మండలం రణవెల్లి గ్రామ శివారులోని ప్రాణహిత నది ఒడ్డున గల ఎత్తిపోతల పథకంలో గల హెవీ మోటర్లలోని రాగి తీగలను దొంగలిస్తున్న మహారాష్ట్ర చంద్రపూర్ జిల్లాకు చెందిన ముఠాను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 5న ఎత్తిపోతల పథకంలోని 95 కిలోల రాగి తీగ, అందులో అమర్చే 15 కిలోల ప్లేట్లు దొంగతనానికి గురైనట్లు లిఫ్ట్ ఇరిగేషన్ సూపర్‌వైజర్ శ్రీకాంత్ చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మంగళవారం తెల్లవారు జామున మళ్లీ ఎత్తిపోతల పథకంలోని రాగి తీగను దొంగలించేందుకు మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన ఐదుగురు ముఠా సభ్యులు వచ్చారు. అప్పటికే అక్కడ మాటువేసి కాపలాగా ఉన్న వాచ్‌మెన్ మరో నలుగురు వెంటనే వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నంలో ఇద్దరు దొంగలు రెడ్‌హ్యాండెడ్‌గా దొరకగా మరో ముగ్గురు దొంగలు నదిలోకి పారిపోయారు. పట్టుబడిన నిందితులు డాన్‌సింగ్, గణేశ్ సోలంకిలను పోలీసులకు అప్పగించారు. దీనితో పోలీసులు విచారణ జరపగా వారితోపాటు మరో ముగ్గురు రాజు సాహు, లాజోల్ సాహు, సతీశ్ సీతారాంలు ఉన్నట్లు తెలిపారు. సిర్పూర్ టి మండలం హుడ్కిలి ఎత్తి పోతల పథకంలో కూడా దొంగతనం చేసింది తామేనని వారు అంగీకరించినట్లు సీఐ తెలిపారు. ఈ ముఠా తెలంగాణ దొంగతనం చేసిన సొత్తును మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో విక్రయించనున్నట్లు తెలిపారు. రణవెల్లి ఎత్తిపోతల పథకంలో దొంగలించిన రాగి తీగను స్వాదీనం చేసుకుని, ఈ ముఠా వినియోగించిన స్కూటి, స్ప్లెండర్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు, దొంగలించబడ్డ రాగి తీగ విలువ సుమారు రూ.1లక్షా25వేలు ఉంటుందన్నారు. ఇక్కడ చింతలమానేపల్లి ఎస్ఐ నరేశ్ ఉన్నారు.

## హెడ్ కానిస్టేబుల్‌పై దాడిచేసిన ఇద్దరిపై కేసు

మంచిర్యాల అర్బన్, మే 6: భూ వివాదంలో పోలీస్ హెడ్ కానిస్టేబుల్‌పై దాడి చేసి గాయపరిచిన ఇద్దరిలపై కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, పట్టణంలోని లక్ష్మి నగర్‌కు చెందిన కందుల రాజేశ్వర్ భూపాలపల్లిలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం విధులు పూర్తి చేసుకొని ఇంటికి వస్తుండగా స్థానిక వెంకటేశ్వర థియేటర్ సమీపంలో బస్ దిగాడు. హైటెక్ సిటీకి చెందిన నల్లాల లక్ష్మి నారాయణ, నల్లాల మురళి రాజేశ్వర్‌పై దాడికి పాల్పడి గాయపరిచారు. రాజేశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

## కుక్కల దాడిలో జింక మృతి

బెల్లంపల్లి, మే 6: కుక్కల దాడిలో ఓ జింక పిల్ల మృతి చెందిన సంఘటన మంగళవారం బెల్లంపల్లి పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, పట్టణంలోని నంబర్ 2 ఇంక్లైన్ బస్తీలోని గోల్ బంగ్లా శ్మశాన వాటిక సమీపంలో రెండు సంవత్సరాల జింక పిల్ల మృతి చెంది ఉంది. తీవ్రంగా గాయపడిన స్థితిలో ఉన్న జింక కుక్కల దాడిలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఐటీడీఏ తోట నుంచి తరచుగా జింక పిల్లలు గోల్‌బంగ్లా శ్మశానవాటిక వైపు వస్తూంటాయి. ఇదే క్రమంలో జింక పిల్ల కుక్కల దాడికి గురైనట్లు తెలుస్తోంది.